ప్రజాశక్తి
గురువారం 16 మార్చి 2023 5
శ్రీ సత్యసాయి



ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

మొదటి రోజు 779 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-అనంతపురంసిటీ

జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నాడు ప్రారంభం అయ్యాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 99 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 29,326 మంది విద్యార్థులకు గాను 28,547 మంది విద్యార్థులు హాజరయ్యారు. 779 మంది గైర్హాజరయ్యారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, డిఇసి మెంబర్లు, హైపవర్ కమిటీ మెంబర్‌లు, జిల్లా అబ్జర్వర్ కలసి 58 పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రంలోకి నిమిషం ఆలస్యమైనా అనుమంతించం అనే నిబంధనతో విద్యార్థులు ఎనిమిది గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొదటిరోజు ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆర్ఐఒ సురేష్ బాబు తెలిపారు.



అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం ప్రారంభం కానుంది. సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపులాగా కాకుండా ప్రాధాన్యతల ప్రకారం ఈ ఓట్ల లెక్కింపు ఉండటంతో సమయం ఎక్కువగా తీసుకునే అవకాశం ఉంది. అయితే ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల సంఖ్య తక్కువగా ఉండటంతో గురువారం సాయంత్రంలోపు ఫలితాలొచ్చే అవకాశముంది. పట్టభద్రులకు సంబందించి శుక్రవారం వరకు వేచి ఉండే అవకాశముంది.

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పట్టభద్రులకు మరుసటి రోజు వరకు కౌంటింగ్ కొనసాగే అవకాశం
- ఉపాధ్యాయ ఫలితాలు గురువారం వెలువడొచ్చు
- గెలుపుపై ఎవరి లెక్కలు వారివి

ఎమ్మెల్సీ ఓట్ల
లెక్కింపు నేడు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మండలి ఎన్నికలకు సంబంధించి అనంతపురం జెఎన్‌టియు కళాశాలలో ఓట్ల లెక్కింపునకు పూర్తి స్థాయి ఏర్పాట్లు జరిగాయి. ఉపాధ్యాయ నియోజకవర్గానికి 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. పట్టభద్రులకు 28 టేబుళ్ల ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు సుధీర్ఘ సమయం పట్టే అవకాశం ఉండడంతో మూడు షిఫ్టుల్లో ఓట్ల లెక్కింపు జరిగే విధంగా 600 మంది సిబ్బందిని నియమించారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో 3,30,124 ఓట్లు ఉంటే 2,44,307 ఓట్లు పోలయ్యాయి. 49 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలోనున్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి 28,148 ఓట్లు ఉంటే 25,884 పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో 12 మంది బరిలోనున్నాయి వీరి భవితవ్యం నేడు, రేపటిలోపు తేలనుంది.

ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత

ఓట్ల లెక్కింపు జరుగుతున్న జెఎన్‌టియు కళాశాల వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేశారు. అటువైపు వెళ్లే రహదారులన్నింటిలోనూ భద్రతను కట్టుదిట్టం చేశారు. లెక్కింపు కేంద్రంలోకి ఏజెంట్లు, అనుమతి ఉన్న వారిని మాత్రమే లోపలికి పంపనున్నారు. తక్కిన వారికి అనుమతినివ్వడం లేదు. కేంద్రం చుట్టూ ఐదు కిలోమీటర్లలోపున్న మద్యం విక్రయ కేంద్రాలను సైతం మూసివేయించారు. 144 సెక్షన్ సైతం అమలు చేస్తున్నారు.



జెఎన్‌టియులో కౌంటింగ్‌కు ఏర్పాటు చేసిన టేబుళ్లు

ఫలితాలపై ఎవరి అంచనాలు వారివే...

మండలి ఎన్నికల ఫలితాలపై ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ఈ ఎన్నికల్లో స్పష్టమవుతుందని విపక్షాలు చెబుతుండగా, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు విజయపథాన నడిపిస్తాయని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. అంతే కాకుండా ఈ ఎన్నికల్లో ఓట్లు కొనేందుకు తాయిలాలు అధికంగా ఇచ్చిన వారిలో అధికార పార్టీ నేతలే ఉన్నారు. శాసనసభ్యులే స్వయంగా రంగంలోకి దిగి పోలింగ్ వారికి అనుకూలంగా జరిపించుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డారు. ఇవి తమ మద్దతుదారుల విజయానికి దోహదం చేస్తుందని అధికారపార్టీ నేతలు భావిస్తున్నారు. ఈ అంచనాలు ఎవరివి సరైనవన్నది మాత్రం మరి కొన్ని గంటల్లో తేలనుంది. ఈ ఫలితాలు రాబోయే సార్వత్రిక ఎన్నికల ఫలితాలపైనా ఎంతోకొంత ప్రభావం చూపే అవకాశం ఉండటమే ఈ ఎన్నికల ఫలితాలపై రాజకీయవర్గాల్లో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అధికారపార్టీకి అనుకూలమా వ్యతిరేకత ఉందా అన్నది ఈ ఫలితాలు కొంత వరకు స్పష్టం చేయనున్నాయన్న విశ్లేషణలు సాగుతున్నాయి.


కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం అనంతపురం నగరంలోని జెఎన్‌టియు కళాశాలలో కౌంటింగ్ కోసం చేపట్టిన ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎన్ని ఓట్లు పోలయ్యాయో దాన్నిబట్టి ఎన్ని రౌండ్ల కౌంటింగ్ నిర్వహించాలనే దానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. లెక్కింపు మొదలైన 6 గంటల తర్వాత మొదటి ప్రాధాన్యత ప్రకారం ఎవరైనా గెలిచారా లేదా, కోటా ఎవరికైనా వచ్చిందా లేదా అనేది తెలుస్తుందని చెప్పారు. కోటా రాని పక్షంలో అక్కడి నుంచి ఎలిమినేషన్స్ మొదలవుతుందన్నారు. ఎలిమినేషన్ మొదలైన తర్వాత ప్రతి అభ్యర్థి ఓట్లను వేరే వాళ్లకు ప్రాధాన్యత ప్రకారం బదిలీ చేసుకుంటూ ఏ స్టేజీలో కోటా క్రాస్ అవుతుందో ఆ స్టేజ్లో ఫలితం వెల్లడి అవుతుందన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి గురువారం రాత్రికి గానీ, శుక్రవారం ఉదయంలోపు ఫలితాలు వెల్లడించే అవకాశం ఉందన్నారు.

పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ హాల్లో 24 టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. మొదటి 16, 17 రౌండ్లు పోలింగ్ స్టేషన్ బాక్సులు తీసుకువచ్చి పేపర్స్ సరిచూసుకుని వాటిని కట్టలు కడతారన్నారు. ఈ ప్రక్రియ గురువారం సాయంత్రం వరకు జరిగే అవకాశం ఉందన్నారు. అనంతరం కౌంటింగ్ మొదలు పెడతామని చెప్పారు. ఈ కౌంటింగ్ 10, 11 రౌండ్లు వచ్చే అవకాశం ఉందని, ఒక్కో రౌండ్ కౌంటింగ్ 2:30 గంటల నుంచి 3 గంటలు పట్టే అవకాశం ఉందన్నారు. కౌంటింగ్ మొదలైన 24 గంటల తర్వాత 17వ తేదీ సాయంత్రం నాటికి మొదటి ప్రాధాన్యత ప్రకారం కోటా వచ్చిందా లేదా అనేది తేలే అవకాశం ఉందన్నారు. కోటా రాని పక్షంలో ఎలిమినేషన్స్ మొదలవుతాయని, ఎలిమినేషన్స్ మొదలయ్యేకొద్ది కోటాకి ఎంత గ్యాప్ ఉందో చూసుకుని పలు రౌండ్ల ఎలిమినేషన్‌లో ఫలితం వచ్చే అవకాశం ఉందన్నారు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రంలోపు ఫలితం ఇచ్చే అవకాశం ఉందన్నారు.



- బడ్జెట్ కేటాయింపులపై 'అనంత' ఆశ
- ఈసారైన అభివృద్ధి నిధులు కేటాయించేరా..!
- నేడు రాష్ట్ర బడ్జెట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న 2023-24 బడ్జెట్‌లోనైనా ఉమ్మడి అనంతపురం జిల్లాకు ప్రత్యేకమైన కేటాయింపులు జరిగేనా లేక గడిచిన మూడేళ్ల లాగానే మొండి చెయ్యి చూపుతారా అని జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం నాడు అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో జిల్లాకు నిధులు విడుదల చేసి కనికరిస్తారా.? లేక గత బడ్జెట్‌ల్లాగానే ఉసూరుమనిపిస్తారా అని ప్రజలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిధులు లేక ఈ ప్రాంతంలో ప్రధాన ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదు. కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టులన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. నిర్వహణకు సైతం నిధుల కేటాయింపుల్లేక అధ్వాన్నంగా మారాయి. జిల్లాకు ప్రధాన జలవనరుగానున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి రోజురోజుకు తీసికట్టుగా మారుతోంది. ప్రవాహ సామర్థ్యం మేరకు నీటిని తీసుకోలేకపోతున్నారు. ఆధునీకరణ పనులను ఈ ప్రభుత్వం మధ్యలలోనే రద్దు చేసింది. మరో ఐదేళ్లు ఆధునీకరణ చేపట్టడానికి వీల్లేదన్న నిబంధనలు సైతం పెట్టింది. కనీసం గండ్లు పడకుండా పటిష్టం చేసేందుకు కూడా నిధులు కేటాయించలేదు. రూ.30 కోట్లు అయిన అవసరమని తుంగభద్ర అధికారులు ప్రభుత్వానిక నివేదించారు. కాని నిధులు మంజూరవలేదు. దీంతో 2002 సంవత్సరంలో తుంగభద్రకు నీరు పుష్కలంగా వచ్చిన సమయంలోనూ నీటిని పూర్తి స్థాయిలో తీసుకోలేని పరిస్థితి నెలకొంది. 30 టిఎంసిలోపే నీరు జిల్లాకు వచ్చింది. పిఎబిఆర్ పూర్తి సామర్థ్యం 11 టిఎంసిలు అయితే ఐదు టిఎంసిలకు మించి నీరు నిలువ చేయడం లేదు. ఎందుకంటే భూసేకరణ ఇప్పటికీ పూర్తి స్థాయిలో జరగలేదు. ఇవి చేయాలంటే సుమారు రూ.400 కోట్లు నిధులు అవసరమవుతాయి. దీనికి నిధులు కేటాయించలేదు. సగం డ్యామ్ నింపడంతోనే సరిపెట్టుకోవవాల్సి వస్తోంది. ఇక హంద్రీనీవా ప్రధాన కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామని ప్రకటించడమే కాకుండా టెండర్లు సైతం పిలిచారు. పనులు మాత్రం ఇప్పటి వరకు ప్రారంభమవలేదు. ఇక బిటిపి ప్రాజెక్టుకి ఎత్తిపోతల ద్వారా చేపడతామన్ని పనులు సైతం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. పేరూరు ఎత్తిపోతల పథకాన్ని గత టెండర్లనే ఆమోదిస్తూ అదనంగా మూడు రిజర్వాయర్లు నిర్మిస్తామని చెప్పడమే కాకుండా శంకుస్థాపన సైతం చేశారు. మూడేళ్లలోపు పనులు పూర్తి చేస్తామని ఆనాడు ప్రకటించారు. కాని ఈ పనులకు సంబంధించి భూసేకరణ సైతం అడుగు ముందుకు పడలేదు. ప్రధాన ప్రాజెక్టులన్నీ ఈ రకంగా పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్రం నిధులతో ముడిపడిన రహదారి, ఇతర పనులు తప్ప రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేటాయించిన పనులేవి జరగడంలేదు. ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్ రహదారి గుంతలమయంగా మారాయి. గ్రామీణ రహదారులు గుంతలమయంగా మారాయి. వ్యవసాయ యంత్రీకరణ, ఉద్యానవన పంటలకిచ్చే సబ్సిడీల్లోనూ కోతలు పెడుతున్నారు. దీంతో అనేక పథకాలు క్రమక్రమంగా కనుమరుగవుతున్నాయి. గతంలో కాయగూరల పంటలకు సబ్సిడపై విత్తనాలు, పాలి హౌస్ వంటి పథకాలకు కోతలు పెట్టేశారు. దీంతో రైతులపై అదనపు భారం పడుతోంది. కొత్త ప్రాజెక్టులు కూడా జిల్లాకు ఈ మూడేళ్ల కాలంలో కేటాయించిన దాఖలాల్లేవు. పాత వాటికీ నిధుల కేటాయింపుల్లేవు. దీంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే విధంగా తయారయింది. వచ్చే ఏడాది ఎన్నికలున్న నేపథ్యంలోనైనా వెనుకబడిన అనంతపురం జిల్లాకు నిధుల కేటాయింపులు పెంచుతారా.? లేక ఎప్పటిలాగానే మళ్లీ ఈ ప్రాంతానికి మొండి చెయ్యి చూపుతారా.? అన్నది నేటి బడ్జెట్‌లో చూడాల్సి ఉంది.

సిపిఎస్ రద్దు తీర్మానం చేయాల్సిందే : యుటిఎఫ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ సిపిఎస్ రద్దుకు సంబంధించి అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం నాడు యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో తాడిమర్రి, బత్తలపల్లి, కనగానపల్లి మండల శాఖల నిర్మాణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్ర హాజరై ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమానికి కట్టుబడి యుటిఎఫ్ పనిచేస్తోందన్నారు. విద్యారంగం సంక్షోభంలో నెట్టబడిందని దీన్ని అధిగమించడానికి ఉద్యమాల ద్వారా సాధిస్తామని తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను కొనసాగించేందుకు తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఎస్ రద్దు కోరుతూ ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం బత్తలపల్లి, కనగానపల్లి, తాడిమర్రి మండల యుటిఎఫ్ శాఖల నిర్మాణం చేయడం జరిగింది. యుటిఎఫ్ బత్తలపల్లి మండల శాఖ అధ్యక్షులుగా ఆర్.రామాంజనేయులు నాయక్, ప్రధాన కార్యదర్శిగా టి.మహబూబ్ బాషా, తాడిమర్రి మండల శాఖ అధ్యక్షులుగా కె.నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శిగా డి.శామ్యూల్ విక్టర్, కనగానపల్లి మండల శాఖ అధ్యక్షులుగా బి.వెంకటరాముడు, ప్రధాన కార్యదర్శిగా ఈ.ఓబులేసులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా యుటిఎఫ్ నాయకులు చంద్రశేఖర్, రమేష్, రామాంజనేయులు, ఓబులేష్, వెంకటరాముడు, నాగభూషణ, గంగాధర్ పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ధర్మవరంలో దౌర్జన్యాలపై యుద్ధానికి సిద్ధం

పరిటాల శ్రీరామ్



సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరం నియోజకవర్గంలో జరిగే దౌర్జన్యాలపై యుద్ధానికి సిద్ధం కావాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లోకేశ్ చేపట్టిన పాదయాత్ర ధర్మవరం నియోజకవర్గంలో మూడు రోజుల పాటు సాగుతుందన్నారు. రాష్ట్రమంతా పాదయాత్ర ఎలా ఉన్నా, ధర్మవరంపై అందరి చూపు ఉందని అన్నారు. ఇక్కడ సాగే యువగళం పాదయాత్ర విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ధర్మవరం అంటే చిరస్థాయిగా నిలిచేలా యువగళం పాదయాత్ర సాగాలని కోరారు. నియోజకవర్గ సమస్యలు లోకేశ్ దష్టికి తీసుకెళ్తే అవి భవిష్యత్తులో పరిష్కారం అయ్యేందుకు దోహదపడతాయన్నారు. ధర్మవరంలో కార్యకర్తలు ఎన్ని కష్టాలు వచ్చినా పార్టీ వీడలేదని, ఇక్కడున్నంత బలమైన కార్యకర్తలు రాష్ట్రంలో ఎక్కడా లేరని అన్నారు. ధర్మవరంలో రాక్షసులతో పోరాడుతున్నామని, ఈ యుద్ధంలో సైనికుల్లా పోరాడాలని తాను కూడా సైనికుడవుతానని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు కమతంకాటమయ్య, చింతలపల్లి మహేశ్ చౌదరి, ఫణికుమార్, బోయరవిచంద్ర, కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి, పోతుకుంటలక్ష్మన్న, కాచర్ల కంచన్న, రమేష్‌బాబు, కరణం ప్రభాకర్, కూచిరామ్మోహన్, గోనుగుంట్ల నారాయణరెడ్డి, సాహెబ్బీ, పోతలయ్య, మేకలరామాంజినేయులు, బీబీ, గొట్లూరుశీన, పురుషోత్తంగౌడ్, గోసల శ్రీరాములు, చింతపులుసు పెద్దన్న, నాగూర్ హుస్సేన్, క్రిష్టాపురం జమీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

అంగన్వాడీల వేతనాల పెంపులో మోసం

పుట్టపర్తి రూరల్: అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం వారిని మోసం చేసిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇస్ వెంకటేష్ విమర్శించారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఇఎస్ వెంకటేష్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి దిల్షాద్ తదితరులు మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూట్ ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో మార్చి 20 న విజయవాడ అలంకార్ సెంటర్లో నిర్వహించే మహా ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శ్రీదేవి, లావణ్య, చంద్రకళ, శోభ, సరస్వతి, రమణమ్మ, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యల పై 17న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టినట్లు మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పట్టణంలోని మునిసిపాలిటీ కార్యాలయం ముందు చలో కలెక్టరేట్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీలోని పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు, రిస్క్ అలవెన్స్, చదువుకున్న వారికి ప్రమోషన్లు తదితర సమస్యలను ప్రస్తుత శాసనసభ బడ్జెట్ సమావేశాల్లోనే చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గౌస్ లాజం, యూనియన్ నాయకులు గోవిందు, పెద్దన్న, నాగార్జున, రామయ్య ఇంజనీరింగ్ యూనియన్ నాయకులు రమణ, రమేష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

మాజీ మంత్రి అభినందన

కనగానపల్లి : మండల కేంద్రానికి చెందిన దాసరి నారాయణ స్వామి రాప్తాడు నియోజకవర్గం బోయ సాధికార ఫెడరేషన్ అధికార ప్రతినిధిగా నియామకం అయ్యారు. ఈ సందర్భంగా మాజీమంత్రి పరిటాల సునీత దాసరి నారాయణస్వామిని బుధవారం అభినందించారు.



అభినందిస్తున్న మాజీ మంత్రి

ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో వాల్మీకుల అభ్యున్నతి పాటు వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

గోరంట్ల : మండలంలో కమ్మవారి పల్లి పంచాయతీ సచివాలయంలో గురువారం జనహిత సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ శివశంకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వివిధ గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతుల వివరాలు ప్రదర్శన

నల్లచెరువు : మండల పరిధిలోని తలుపుల వాండ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రబీలో సాగుచేసిన పంటల వివరాలను క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతుల వివరాలను రైతు భరోసా కేంద్రంలో బుధవారం ప్రదర్శించారు. ఈ క్రాఫ్ బుకింగ్ నమోదు చేయించుకున్న రైతుల వివరాలు సరిగా ఉన్నాయా లేదా అని సరిచూసుకోవాలని వారి పేర్లను చదివి వినిపించామనిగ్రామ సచివాలయ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శి, ఎఇఒ, వెటర్నరీ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వైకుంఠ రథం ఏర్పాటుకు విరాళం

గోరంట్ల : గోరంట్ల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న వైకుంఠ రథానికి తమ వంతు సహాయంగా పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం లక్ష రూపాయలు విరాళం అందజేసింది. ఈ మేరకు ఆ మొత్తాన్ని బుధవారం గ్రామ కార్యదర్శి సతీష్ కుమార్‌కు అందజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాలల నిర్వాహకులు లలితమ్మ, మధుసూదన్, రవీంద్ర, లక్ష్మీపతి, అంజన రెడ్డి, బ్రాడ్ వే స్కూల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

గాండ్లపెంట : మండల పరిధిలోని వేపరాల సచివాలయాన్ని ఎంపీపీ తాతం జగన్మోహన్ బుధవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలిచారు. ప్రజలకు రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది యూనిఫామ్ తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఎన్ అమీర్‌బాషా, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మడకశిర రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో సింహగిరి ఫోర్ వీలర్స్ డ్రైవర్ ఓనర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఫైనల్స్ సూరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింహగిరి ఫోర్ వీల్స్ డ్రైవర్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, కార్యదర్శి రవి, అసోసియేషన్ సభ్యులు ఈరప్ప, సంజీవ రాయుడు, మహేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల సమయానికి బస్సులు నడపాలి

ధర్మవరం టౌన్ : ఇంటర్ పరీక్షలు రాసేందుకు ధర్మవరం పట్టణానికి గ్రామీణ ప్రాంతాల నుండి విద్యార్థులు వస్తున్నారని వారికి పరీక్షల సమయానికి అనుకూలంగా బస్సులు నడపాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గసభ్యులు విజయ భాస్కర్ కోరారు. ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రానిన ఆర్టీసీ డిఎం మోతీలాల్‌నాయక్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చైతన్య, సుధీర్, నాగమోహన్, రాజేశ్, కృష్ణ, తాహీర్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేద్దాం: కందికుంట

తనకల్లు , కదిరి టౌన్ : నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను విజయవంతం చేద్దామని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ వద్దగల మారప్ప గారి పల్లి గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన మైనార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన సత్యసాయి జిల్లా లోకి అడుగుపెడుతున్న నారా లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.



కందికుంట వెంకటప్రసాద్

ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛారిజ మల్లికార్జున, మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, ఖాన్, సీనియర్ నాయకులు ఉస్తినిపల్లి హరి తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు : నారా లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పిలుపునిచ్చారు.బుధవారం మండల కేంద్రంలోని చౌడేశ్వరీ దేవి కళ్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన,నల్లమాడ మండలంలోని పులగంపల్లి వద్ద నుండి పుట్టపర్తి నియోజకవర్గంలో పాదయాత్ర మొదలవుతుందని తెలిపారు. 21,25 వ తేదీలలో ఓబులదేవరచెరువు, నల్లమాడ మండలాలలో పాదయాత్ర వుంటుందని తెలిపారు. 21వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు పులగంపల్లి వద్దకు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి, కాలేనాయక్, అంజినేయులు, వెంకటేష్, శంకర్ నాయుడు,స్టూడియో మూర్తి, డాక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాలువ పనుల పరిశీలన

హిందూపురం : పురపాలక స:ఘ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో గుత్తేదారులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర రావు సూచించారు. రైల్వే రోడ్డులో జరుగుతున్న మురుగు కాలువ నిర్మాణ పనులను కమిషనర్ బుధవారం పరిశీలించారు. పనులను త్వరతగితిన పూర్తి చేయాలని అధికారులకు, గుత్తేదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇ నీరజ, ఎఇ సురేష్, గుత్తేదారులు రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ధర్మవరం టౌన్ : మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరిం చాలని సిఐటియు నాయకులు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కరించాలని పలుమార్లు అధికారులు.. పాలకులకు విన్నవించిన పట్టించుకోలేదన్నారు. అందుకే ఈనెల 17 వతేదీన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. ఈ ముట్టడి కార్యక్రమానికి కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమలో సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, అయూబ్‌ఖాన్, నాయకులు రఫీ, మున్సిపల్ కార్మికసంఘం నాయకులు ఎం.బాబు, చెన్నకేశవులు, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

లీజు ఒప్పందం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి : వ్యకాసం



ఫ్యాక్టరీ యజమాని ఇంటిముందు ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని రావు బహదూర్ శ్రీరామ్ నర్సింగ్ దాస్ అనే ప్రైవేట్ కంకర ఫ్యాక్టరీ యజమానులు రైతులకు నాలుగు సంవత్సరాలుగా లీజు ఒప్పందం ప్రకారం చెల్లించవలసిన లీజు డబ్బులు చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి అధ్యక్షతన రైతులతో కలిసి బుధవారం ఫ్యాక్టరీ యజమాని ఇంటి ముందర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దన్న మాట్లాడుతూ క్వారీ ఏర్పాటు నిమిత్తం నల్లగొండ రాయన పల్లె గ్రామానికి చెందిన నిరుపేద రైతులు 26 మందితో 20 ఎకరాలు 2017 సంవత్సరంలో క్వారీ యాజమాన్యం లీజు ఒప్పందం చేసుకుందనానరు. 10 సంవత్సరాల పాటు ఒక ఎకరానికి సంవత్సరానికి 50వేల రూపాయలు చొప్పున ప్రతి సంవత్సరం 5 శాతం పెంచుకునే విధంగా లీజు ఒప్పందం చేసుకున్నారనానరు. ఈ ఒప్పందాన్ని క్వారీ యాజమాన్యం మొదటి మూడు సంవత్సరాలు అమలు చేసిందన్నారు. అయితే గత 4 సంవత్సరాల నుండి రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని చెల్లించకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఒప్పందం ప్రకారం బకాయి ఉన్న పరిహారాన్ని చెల్లించాలని రైతులు ఎన్నిసార్లు కోరినా క్వారీ యాజమాని చౌదరి స్పందించలేదన్నారు. దీంతో రైతులతో కలిసి ఆందోళకు దిగాల్సి వచ్చిందన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మురళి ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్వారీ యజమాని రైతులతో సంప్రదింపులు జరిపారు. ఏప్రిల్ 7వ తేదీ లోపు నష్టపరిహారం రైతులకు అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశులు, సుబ్బరాయుడు, చిన్నకిష్టప్ప, కాలప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాట్యంలో కదిరి చిన్నారుల ప్రతిభ

ప్రజాశక్తి - కదిరి అర్బన్



అవార్డులతో చిన్నారులు

తెలంగాణ ప్రభుత్వం, నటరాజ్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి లో నిర్వహించిన సకల కళా సమ్మేళన జానపద ఉత్సవాలు 2023 లో భాగంగా కదిరికి చెందిన నాట్య కళాకారులు ప్రతిభ కనపరాచరు. మామిల్లా పృథ్వీరాజ్, అశ్వినికుమార్తె అవంతిక, కాలేజ్ కూడలిలోని వీణా, లక్ష్మీపతి దంపతుల కుమార్తె నేహప్రియ నాట్య విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. వీరిరువురు కదిరికి చెందిన మయూరి నాట్య అకాడమీలో శిక్షణ పొందారు. వీరికి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రంజిత్ సభ్యులు రాఘవేంద్ర ప్రశాంత్ ,శివశంకర్ , వాల్మీకి అనిల్ కుమార్, డాక్టర్ మదన్, తాహెర్ వలి, నితిన్, సానే అనిల్ రెడ్డి అభినందనలు తెలిపారు.

అవయవదానంపై అవగాహన

ప్రజాశక్తి-హిందూపురం

అవయవదానం చేసి ఎదుటి వారికి ప్రాణదానం చేద్దామనిచైతన్య సంస్థ గంగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య గంగిరెడ్డి, జన విజ్ఞాన వేదిక నాయకులు రామకృష్ణ, ధనాపురం వెంకట్రామిరెడ్డి మాట్లాడుతు అవయదానం చేసి మరణించినా జీవిద్దామనానరు. అవయవదానం పై పూర్తిస్థాయి అవగాహన ప్రజల్లో రాలేదన్నారు. అవయవదాన గొప్పతనాన్ని తెలియజేసేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరు అవయవదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు ఆదినారాయణ, ఒపిడిఆర్ శ్రీనివాసులు, శైలశ్రీ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గంగిరెడ్డి

పన్ను చెల్లించకపోతే ఇళ్లు వేలం వేస్తాం...

దళితులను బెదిరిస్తున్న మున్సిపల్ అధికారులు



అధికారులు తొలగించిన నీటి పైప్‌లైన్

ప్రజాశక్తి మడకశిర రూరల్

మడకశిర పట్టణంలోని శివాపురంలో దళిత కుటుంబాలకు మున్సిపల్ కమిషనర్ బెదిరిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. కాలనీకి చెందిన బాబును ఇంటి పన్ను బకాయిలు చెల్లించాలని లేకపోతే ఇంటిని వేలం వేస్తామని హెచ్చరిస్తున్నారని వాపోయారు. కాలనీకి చెందిన ముగ్గురు దళిత కుటుంబాలకు చెందిన ముత్యాలమ్మ భీమ్లా నాయక్, బాబు ఇంటి పన్ను చెల్లించలేదని పన్ను కట్టకపోతే ఇళ్లను వేలం వేస్తామని రోజు ఇళ్ల వద్దకు వచ్చి తమను బెదిరిస్తున్నారని వాపోయారు. గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ఫ్రీ కొళాయిలు ఇవ్వడంతో పైప్ లైన్ వేసుకున్నామని దానికి కూడా వేల రూపాయలు పన్నులు వేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా బాధితుడు బాబు మాట్లాడుతూ దళిత కుటుంబానికి చెందిన తనకు ఇంటి పన్ను రూ. 50వేలు వచ్చిందని, దీనికి మరో రూ. 23వేలు పెనాల్టీ వేసి నోటీసులు ఇచ్చారన్నారు. ఇంతమొత్తం ఏ విధంగా కట్టగలమని మున్సిపల్ కమిషనర్ ను అడిగితే కట్టాల్సిందే అని లేకపోతే ఇల్లు వదిలి వెళ్లాలని ఇంటిని వేలం వేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. దళితులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్న మున్సిపల్ కమిషనర్ వైఖరికి నిరసనగా మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపడతామని ఈసందర్భంగా బాధితులు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, మహిళలు

అమరాపురం : సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మండల సమైక్య అధ్యక్షురాలు లలితమ్మ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని వైఎస్ఆర్ మహిళ మండల సమైక్య కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండల సమాఖ్య అధ్యక్షురాలు లలితమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం తిప్పన్న, సీసీలు సన్నప్ప, భాస్కర్, గోవిందరాజు, వక్కలిగ సంఘం డైరెక్టర్ గగన తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు వ్యాపార రాజకీయ విద్య తదితర రంగాలతో రాణించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనిమేటర్లు హనుమంతరాయ, హనుమక్క, ఈరన్న, స్వామి, రవీంద్రతోపాటు అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక జీవనజ్యోతి మండల సమాఖ్య కార్యాలయంలో వెలుగు మండల సమాఖ్య అధ్యక్షురాలు గౌసియా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం బాబ్జి, ఎంపిడిఒ రమానాయక్, ఐఒఆర్‌డి శకుంతల పాల్గొన్నారు.

నల్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి మండల సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ప్రభావతి, ఎపిఎం వెంకట రమణమ్మ మునెప్ప, సీసీలు హనుమంతు, ప్రవీణ్ కుమార్, కదిరప్ప, ఎంఎస్ఎ సుగుణమ్మ, విఒలు, మండల సమాఖ్య సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : మహిళలు ఆర్థిక స్వాలంబన చెందాలని ఎంపీడీవో సుధామణి, ఎపిఎం శారద సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని కదిరి మండలం ఖాద్రి ఎంఎస్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం రవీంద్ర, సిసిలు, అనిమేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

వినియోగదారులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవాలని న్యాయవాది శివశంకర్ అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రూరల్ మండల పరిధిలోని బిట్ ఇంజనీరింగ్ కళాశాలలో జీవన జ్యోతి వెల్‌ఫేర్ అసోసియేషన్ తరపున జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు కె. నాగజ్యోతి ఆధ్వర్యంలో వినియోగదారులు, హక్కులు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది శివశంకర్ మాట్లాడుతు క్లీన్ ఎనర్జీ, ఇంధన వినియోగం, వినియోగదారుల ఫోరమ్, హక్కులు, చట్టాలు, పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రమేష్, అధ్యాపకులు మాధురి, దయానంద్, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది శివశంకర్

ఇసుక దారిలో మట్టిరోడ్డు ఏర్పాటు



రోడ్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి రొద్దం

మండలంలోని పెన్నా నదిలో నల్లూరి కల్లుకుంట మధ్య రోడ్డు దాదాపు 200 మీటర్ల పొడవునా మట్టిరోడ్డును సర్పంచి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రోడ్డు మొత్తంఇ సుకతో

ప్రజాశక్తి వార్తకు స్పందన

కప్పేయడంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు ఈ దారిమీద వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. ఈ విషయపై గత నెల 24న ప్రజాశక్తి దినపత్రికలో 'రోడ్డును కప్పేసిన ఇసుక' అనే శీర్షిక ప్రచురితమైన కథనానికి అధికారులు, పాలకులు స్పందించారు. ల్లూరు సర్పంచి క్రిష్టప్ప, ఉప సర్పంచి కల్లుకుంట క్రిష్టప్ప సమస్యను పెనుగొండ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ దృష్టికి తీసుకుపోయారు. దీంతో అయన స్పందించి రోడ్డు మరమ్మతులకు ఆదేశాలివ్వడంత రెండు రోజుల నుంచి నదిలో మట్టిరోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.. రోడ్డు మరమ్మతు చేపడుతుడటంతో మండల ప్రజలు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో దగ్ధం

గోరంట్ల : పట్టణంలో సాయిబాబా ట్యాంకు సమీపాన నివాసమున్న రెహమాన్ తన ఇంటి వద్ద పార్కింగ్ చేసి ఉంచిన ఆటోకు బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో ఆటో పూర్తిగా కాలిపోయింది. తనకు 80 వేల రూపాయలు నష్టం వాటిల్లిందని బాధితుడు రెహమాన్ వాపోయారు. తనకు జరిగిన అన్యాయంపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత

సోమందేపల్లి : స్థానిక వైయస్సార్ సర్కిల్ లో అక్రమంగా కర్నాటకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎస్ఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం పట్టుకున్నారు. పెనుకొండ వైపు నుంచి బాగేపల్లి వైపు వెళ్తున్న ఆటోను ఆపి పరిశీలించిన పోలీసులు అందులో 23 రేషన్ బియ్యం పొట్టాలు ఉన్నాయని గమనించారు. బియ్యాన్ని సీజ్ చేసి డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు, నరేష్, రంగనాయకులు, జగన్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: అనంతపురం నుంచి టాటా యోదా వాహనంలో తరలిస్తున్న 55 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు రామగిరి ప్రాంతంలో పట్టుకున్నారు. అనంతపురం చిన్మయనగర్ చెందిన బోయ రవి, కనగానపల్లి మండలం వేపకుంట గ్రామానికి చెందిన హరికృష్ణ రేషన్‌బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ జనార్దననాయుడు తెలిపారు. బియ్యాన్ని సీజ్ చేసి నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు.

గాయపడిన వ్యక్తి మృతి

పరిగి : మండలంలోని ధనాపురం క్రాస్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతిచెందారు. ఈ ప్రమాదంలో వస్సంపల్లికి చెందిన సంజీవరెడ్డి ప్రమాద సమయంలోనే మృతిచెందారు. అయితే ఈ ప్రమాదంలో గాయపడిన మరో యువకుడు నాగభూషణ(31)అనంతపురంలో ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందారు.

చింతచెట్టు కొమ్మ విరిగిపడి కూలీ మృతి

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని గాజులపల్లి గ్రామంలో చింత చెట్టు కోస్తుండగా పై నుండి కొమ్మ విరిగి పడి రామచంద్ర (35) అనే కూలి అక్కడికక్కడే మృతి చెందారు. గోరంట్ల మండలం బూదిలి గ్రామానికి చెందిన రామచంద్ర చెట్టు కోయడానికి కూలి పనులకు వెళ్లేవాడు. అదే క్రమంలో గాజులపల్లిలో బుధవారం చింతచెట్టు కోస్తుండగా సగం కోసిన కొమ్మ ఒకటి అతనిపై పడింది. ఈ ప్రమాదంలో రామచంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పుట్టపర్తి రూరల్ పోలీసులు సందర్శించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు చెప్పారు.



పూలతో అలంకరించిన కాళేశ్వర్ సమాధి

ఘనంగా సాయి కాళేశ్వర్ వర్ధంతి

పజాశక్తి- పెనుకొండ

డాక్టర్ సాయి కాళేశ్వర్ 11వ వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణంలోనిశివసాయి మందిరం వద్ద గల కాళేశ్వర్ సమాధిని ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. కాళేశ్వర్ తల్లి దండ్రులు సుబ్బమ్మ, సుబ్బరాయుడు,షిర్డీ సాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప, భాస్కర్ రెడ్డి, కుమార్తె నవ్యశ్రీ కాళేశ్వర్ సమాధి వద్ద ఘన నివాళులర్పించారు. అదేవిధంగా పలువురు ప్రముఖులు, విదేశీ భక్తులు,విద్యార్థులు,ట్రస్ట్ సిబ్బంది చిట్టిబాబు, హరి, బాబు,ఆశ్రమ సిబ్బంది,సాయి కాళేశ్వర్ సమాధిని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

ద్విచక్ర వాహనాల వేలం

సోమందేపల్లి : ఎక్సైజ్ కేసులో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు, ఆటోకు స్థానిక పోలీసుస్టేషన్ వద్ద బుధవారం వేలంపాట నిర్వహించారు. ఎస్ఐ విజయ్ కుమార్, ఎక్సైజ్ సిఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. 8 ద్విచక్ర వాహనాలు, ఆటోకు ప్రభుత్వ ధర రూ. 1,66,500 నిర్ణయించగా రూ. 2,14 170 ధర పలికాయి. దీనివల్ల ప్రభుత్వానికి రూ.47670ల ఆదాయం వచ్చింది.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

కొత్తచెరువు : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. కొత్తచెరువు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల. శివ సాయి జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు.

రొద్దం : మండలంలోని జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 84 మంది విద్యార్థులకు గాను 82మంది పరీక్షలకు హాజరయ్యారని ప్రిన్సిపల్ విజయలక్ష్మి తెలపారు. ఎస్ ఐ నాగస్వామి ఆధ్వర్యంలో పోలీసులు మహేష్, రాజేశ్వరి బందోబస్తు నిర్వహించారు.

లేపాక్షి : మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు సజావుగా జరిగాయి. చీప్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మొదటిరోజు పరీక్షకు 192 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. రాష్ట్ర పరీక్షల పరిశీలకులు పరీక్షా కేంద్రాన్ని సందర్శిం చారు.

అమడగూరు : మండల పరిధిలోని శీతి రెడ్డిపల్లి సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది మోడల్ స్కూల్, కస్తూరిబా పాఠశాల విద్యార్థులు పరీక్షలు హాజరయ్యారు. మొదటి రోజు మొదటి సంవత్సరం తెలుగు,హిందీ పరీక్షలకు మొత్తం 87 విద్యార్థులకు గాను 84మంది హాజరయ్యారని చీఫ్ ప్రభాకర్, డిఒ వెంకటరమణ తెలిపారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్